సాక్షి
కుమురం భీం
శనివారం । 15 ఏప్రిల్ । 2023



హైదరాబాద్‌కు ప్రజాప్రతినిధులు
ఆసిఫాబాద్: హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు.

సభకు హాజరైన జనం



రంజాన్ వేళలు
ఇఫ్తార్ శని : 6:33
సహర్ ఆది : 4:34

న్యూస్‌రీల్

దంచికొడుతున్న ఎండలు



కౌటాల: జిల్లాలో ఎండలు దంచికొడున్నాయి. జిల్లాలో వడగాలులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా శుక్రవారం జిల్లాలోని కౌటాలలో 44.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. తిర్యాణిలో 43.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదుగా కాగా, ఎల్కపల్లిలో 42.8, బెజ్జూర్‌లో 42.6, కెరమెరిలో 42.4, వాంకిడిలో 42.3, జంబుగాలో 42.3, కాగజ్‌నగర్‌లో 42.2, రవీంద్రనగర్‌లో 42.1, ఆసిఫాబాద్‌లో 41.5 డిగ్రీలుగా నమోదయ్యాయి.

ఉచిత శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డీఈవో అశోక్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో డీఆర్‌సీలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న పాలిసెట్, ఇతర ఎంట్రెన్స్ పరీక్షల ఉచిత శిక్షణను శుక్రవారం డీఈవో అశోక్ ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఈవో మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి సమానత్వపు హక్కును ప్రసాదించాడన్నారు. కోచింగ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, మండల విద్యాధికారి భిక్షపతి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి రవి

చింతలమానెపల్లి(సిర్పూర్): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సిర్పూర్(టి) సివిల్ కోర్టు న్యాయమూర్తి పి.రవి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై అవగాహన ఉండాలని సూచించారు. అంబేడ్కర్ అందరి వాడని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు బాల్యా వివాహాలు చేసుకోవద్దని, బాల్యవివాహాలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తారని తెలిపారు. వసతి గృహాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడొద్దని, కించపరిచే విధంగా మాటాలు మాట్లాడొద్దని సూచించారు. మూఢ నమ్మకాలను వీడాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్, న్యాయవాదులు గణపతి, కల్యాణ్, ఎస్సై విజయ్‌కుమార్, ఎస్‌వో శ్రీజ నందిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాత జార్జిరెడ్డి అని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ అన్నారు. జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం నివాళులర్పించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రణయ్ మాట్లాడుతూ జార్జిరెడ్డి ఆలోచనలు యువకుల హృదయాల్లో సజీవంగా ఉన్నాయన్నారు. విద్యార్థి నాయకులు జార్జిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సైదం నాగరాజు, గడ్డల ప్రణయ్, ప్రశాంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కదనోత్సాహం

- సత్యాగ్రహ సభ విజయవంతం
- కేసీఆర్‌ను తూర్పారబట్టిన నేతలు
- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అంటూ భరోసా
- ప్రసంగాల్లో ఉమ్మడి జిల్లా, సింగరేణి సమస్యలు



మల్లిఖార్జున్ ఖర్గేను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ప్రేంసాగర్‌రావు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వీహెచ్, సురేఖ, మాణిక్‌రావు ఠాక్రే

శ్రీరాంపూర్(మంచిర్యాల): మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భారత్ సత్యాగ్రహ సభ పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహం నింపింది. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర నెల రోజులపాటు సాగి నస్పూర్‌కు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని నూతన కలెక్టరేట్ సమీపంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలి వచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేతోపాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు సభకు రావడంతో వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్రంలో వచ్చే శాసన సభ ఎన్నికలకు ఈ సభ నుంచే శంఖారావం పూరించినట్లుగా నేతలు ప్రసంగించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోడుభూములు, ఆదివాసీల సమస్యలు, సాగునీటి సమస్య, ఇరిగేషన్ ప్రాజెక్టులు, సింగరేణి సమస్యలపై నేతలు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ప్రతీ వర్గాన్ని స్పృశించేలా నేతలు మాట్లాడడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. సాయంత్రం 5.30 గంటలకు సభ ప్రారంభమై ముఖ్య నేతలు ప్రసంగిస్తారనుకుంటే మూడుగంటలు ఆలస్యంగా సభ నిర్వహణ జరిగినా కార్యకర్తలు, సభకు వచ్చిన వారు ఏమాత్రం కదలకుండా చివరి వరకు మైదానంలోనే ఉన్నారు. సభ పక్కన ఏర్పాటు చేసిన మరో వేదికపై నుంచి కళాకారులు పాటలు పాడుతూ ఉత్సాహపరిచారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ కూడా హాజరై కాంగ్రెస్ పార్టీకి సంబంధించి తాను రూపొందించిన పాటను పాడి వినిపించారు. అందరు నేతల ప్రసంగాలు వీక్షించేలా మైదానం మధ్యలో స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మికులను ఆకట్టుకునేలా వారి సమస్యలను కూడా ఇందులో నేతలుప్రస్తావించారు. సభకు డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అధ్యక్షత వహించారు. సభ అనంతరం ఖర్గేను సన్మానించి బుద్ధుని ప్రతిమ జ్ఞాపికగా అందజేశారు.

ప్రేంసాగర్‌రావు నివాసంలోనే ఖర్గే బస
సభలో పాల్గొన్న మల్లిఖార్జున్ ఖర్గే శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు నివాసంలోనే బస చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మంచిర్యాలకు వచ్చిన ఆయన సభ పూర్తయ్యే సరికి రాత్రి కావడంతో తిరుగు ప్రయాణం వీలుకాలేదు. ముందస్తు షెడ్యూల్‌లో భాగంగా ఆయన ఇక్కడే బస చేస్తున్నట్లు నేతలు తెలిపారు.

హాజరైన నేతలు
సత్యాగ్రహ సభకు జాతీయ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతోపాటు తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఉత్తమకుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, మాజీ ఎంపీలు బలరాంనాయక్, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మల్లు రవి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్, అంజన్‌కుమార్ యాదవ్, నాగం జనార్దన్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి, జగ్గారెడ్డి, పాల్వాయి స్రవంతి, మంచిర్యాల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుర్మిళ్ల వేణు, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూ ముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

పాదయాత్రగా సభకు..

నస్పూర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర నస్పూర్ పట్టణంలో శుక్రవారం కొనసాగింది. గురువారం సీసీసీ కార్నర్ వద్ద ముగిసిన పాదయాత్ర శుక్రవారం సీసీసీ కార్నర్ నుంచి ప్రారంభమై కలెక్టరేట్ భవన సముదాయం సమీపంలోని జై భారత్ సత్యాగ్రహ సభ వరకు సాగింది. నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పాల్గొన్నారు. పాదయాత్రకు సీసీసీ కార్నర్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని, బతుకమ్మలు, డప్పుచప్పుల్ల మధ్య సభా ప్రాంగణానికి చేరుకున్నారు. వేదికపై ప్రజా గాయకుడు గద్దర్ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యాక్రమాలు సభికులను అలరించాయి.



బోనాలతో తరలివస్తున్న మహిళలు


విగ్రహాలతో ప్రజాస్వామ్యం ఉన్నట్లు కాదు

– సీతక్క, ములుగు ఎమ్మెల్యే

పెద్దపెద్ద విగ్రహాలు, భవంతులు కడితే ప్రజాస్వామ్యం ఉన్నట్లు కాదు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. అంబేడ్కర్ పేదల, బడుగు బలహీనవర్గాల ఆత్మగౌరవం. ఆయన ఆలోచన విధానంతోనే కాంగ్రెస్ ముందుకు వెళ్తుంది. ఆయన రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలంతా ముందుకు రావాలి. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ప్రజల కోసం పని చేసే పార్టీ.

జిల్లాలో 8 సీట్లు గెలుస్తాం

– మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు



ఉమ్మడి జిల్లాలో 8 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తీరుతాం. టీపీసీసీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకున్న తరువాత మొదటి సభ ఇంద్రవెల్లిలో పెట్టామని లక్షమందితో సభ విజయవంతమైంది. ఇప్పుడు భట్టి పాదయాత్ర మొదటి సభ కూడా పెద్దయెత్తున విజయవంతం కావడం చూస్తే ఇది రాబోయే ఎన్నికల దశ దిశను చూపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనడానికి ఈ సభే సందేశం. ఉమ్మడి జిల్లాలో అన్ని వనరులున్నా అభివృద్ధిలో వెనుకబడింది. కొట్లాడే దమ్ము, ధైర్యం లేని నాయకుల వల్ల ఈపరిస్థితి. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, వేదికపై ఉన్న వారిలో ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారు. వారు కచ్చి తంగా బడ్జెట్‌లో ఈజిల్లాకు 20 శాతం నిధులు ఇవ్వాలి. అప్పుడే అన్ని జిల్లాలతో సమానంగా అభివృద్ధి గడిస్తుంది. సింగరేణిని కేసీఆర్ దోచుకుంటున్నారు. సింగరేణి నిధులను ఈ ప్రాంతాల్లో ఖర్చుచేయకుండా సిరిసిల్ల వంటి ప్రాంతాలకు తరలించి ఇక్కడ అన్యాయం చేస్తున్నారు.

యుద్ధం మొదలైంది

– వీ.హన్మంతరావు, మాజీ ఎంపీ

రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలపై ప్రజాయుద్ధం మొదలైంది. కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం చేస్తున్నారు. 2014 నుంచి 2022 వరకు బీసీలకు రూ.55 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి అందులో రూ.687 కోట్లు మాత్రమే రిలీజ్ చేశారు. అన్ని జిల్లాల కంటే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వెనుకబడింది. ఇది పనిష్మెంట్ జిల్లాగా అధికారులను ఇక్కడికి పంపిస్తారు. 1993లో ఓబీసీ కోసం కాంగ్రెస్ పార్టీ బీసీ మండల్ కమిషన్ తెచ్చింది. కానీ ఈ ప్రభుత్వాలు బీసీలకు ఎక్కడా సరైన బడ్జెట్ కేటాయించడం లేదు. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టడంతో సరిపోదు..గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలు కూలుతున్నా పట్టించుకోవడం లేదు. చార్మినార్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం. మరో పక్క బీజేపీ ప్రభుత్వం దేశంలో హిందువులే ఉండాలట, ముస్లింలు ఉండద్దంటుంది. అన్ని వర్గాలు త్యాగాలు చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నారు.

గనుల వేలానికి బీఆర్ఎస్ నేతలే బాధ్యులు..

– జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

సింగరేణిలో నాలుగు బొగ్గు గనుల వేలానికి బీఆర్ఎస్ నేతలే బాధ్యులు. కేంద్రం చేసిన ఎంఎండీఆర్ చట్టం 2015కు లోక్‌సభలో ఓటు వేసింది ఆ పార్టీ ఎంపీలు కాదా.. అప్పుడు ఎంపీలుగా ఉన్న బాల్క సుమన్, కల్వకుంట్ల కవిత ఓటు వేయలేదా చెప్పాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జల, అటవీ, సింగరేణి, విద్యుత్ సంస్థలు వంటి సంపద ఉంది. కానీ ఇక్కడిప్రజలు వివక్షతకు గురవుతున్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఒక లిఫ్ట్ పెట్టి ఎల్లంపల్లికి మళ్లిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమయ్యేది.బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం వహించింది.

'కల్వకుంట్ల' కుటుంబం నుంచి విముక్తి కావాలి

– మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీ

తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబం నుంచి విముక్తి గావాలి. తండ్రి లిక్విడ్‌లో, బిడ్డ లిక్కర్‌స్కాంలో, కొడుకు కేటీఆర్ లీక్‌ల స్కాంలో, అల్లుడు హరీశ్‌రావు నీటి ప్రాజెక్టుల కుంభకోణాల్లో ఉన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ అరాచక పాలన సాగిస్తున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టాలి. జిల్లాల్లో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించకుండా ఉమ్మడి జిల్లాకు టీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసింది. ప్రజలంతా సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం పోరాడాలి. ఆ కోవలోనే నేడు 'భట్టి' విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

– శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే, మంథని

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో ప్రజాసామ్యం ఖూనీ అయ్యింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ప్రతిపక్షాలకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు. రాహుల్‌గాంధీని సభలోకి రాకుండా చేసే కుట్రలో భాగంగానే కేసులు పెట్టించి సభ్యత్వం రద్దు చేయించారు. కేసీఆర్ ఇప్పుడు 125 అడుగుల అంబేడ్కర్ పెట్టడం ఓట్ల కోసమే. తొమ్మిదిన్నర ఏళ్ల నుంచి దళితులకు ఏం న్యాయం చేశారో చెప్పాలి.



బోనాలతో సభకు హాజరైన మహిళలు



వేదికపై గద్దర్ ఆటాపాట



అభివాదం చేస్తున్న మల్లు భట్టి విక్రమార్క, ప్రేంసాగర్‌రావు



డప్పు విన్యాసాలతో సభకు విచ్చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



లుంబినీ దీక్ష భూమి వద్ద జెండా ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



కలెక్టరేట్ ఆవరణలో నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్
- జిల్లా కేంద్రంలో ఘనంగా జయంతి

ఆసిఫాబాద్: అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ 132 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు జ్యోతి ప్రజ్వలన చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్షభూమి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం, రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ అని కొనియాడారు. అణగారిన కులంలో పుట్టి ఉన్నత విద్యనభ్యసించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి అందించారన్నారు. కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి అధికారి మణెమ్మ, షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి సజీవన్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, దళిత సంఘాల నాయకులు జాడె బాపు, మాహోర్కర్ అశోక్, తుకారాం, హోక్టు, మనోహర్, రేగుంట కేశవరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సుభాశ్, అరుణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ రాజేశం

ప్రమాదం అంచున 'అడ'

- కుమురంభీం(అడ) ప్రాజెక్టు మరమ్మతులు గాలికి..
- నిధులు లేవంటున్న అధికారులు
- అస్తవ్యస్తంగా మారిన నిర్వహణ
- పనులన్నీ పూర్తికాకుండానే చేతులెత్తేసిన కాంట్రాక్టర్



కుమురంభీం(అడ) ప్రాజెక్టు



గతేడాది వర్షాలకు కుంగిన ప్రాజెక్టు ఆనకట్ట

సాక్షి, ఆసిఫాబాద్: కుమురం భీం ప్రాజెక్టు(అడ) ప్రమాదకరంగా మారింది. గతేడాది భారీ వర్షాలకు ప్రాజెక్టు ఆనకట్ట కృంగిపోయిన సంగతి తెలిసిందే. అప్పట్లో పూరిళ్లను వర్షం నుంచి రక్షించుకునేందుకు కవర్లు కప్పినట్లుగా అధికారులు ప్లాస్టిక్ కవర్లతో ప్రాజెక్టుపై కప్పి కాపాడుకునేందుకు నానా తిప్పలు పడ్డారు. మరి అంత పెద్ద ప్రాజెక్టు ఇప్పుడు ప్రమాదం నుంచి బయటపడిందా? అంటే దాని నిర్వహణకు నిధులు లేవని సమాధానం వస్తోంది. పైగా ప్రాజెక్టు పనులన్నీ పూర్తికాకుండానే కాంట్రాక్టర్ చేతులెత్తేయడం కొసమెరుపు.

పది టీఎంసీల సామర్థ్యం..
పది టీఎంసీల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు 15 ఏళ్ల కిందట నిర్మించారు. అప్పటి నుంచి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. నిధులు లేక కుడి, ఎడమ కాల్వలు నిర్మించలేదు. 45 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉండగా.. ఎక్కడా కూడా సక్రమంగా నీరందివ్వలేదని స్థానికులు చెబుతున్నారు. చివరికి ప్రాజెక్టు ఆనకట్టను కూడా కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడటంపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నిర్వహణను గాలికొదిలేసిన కాంట్రాక్టర్..
కుమురంభీం ప్రాజెక్టును నవయుగ నిర్మాణ సంస్థ చేపట్టింది. 2009లో రూ.450 కోట్ల అంచనాలతో ఆనకట్ట, బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. కుడి, ఎడమ కాల్వల నిర్మాణంతోపాటు ఇతర పనులన్నీ పూర్తి చేసి ప్రాజెక్టును అప్పగించాల్సిన సంస్థ నిర్వహణను గాలికొదిలేసింది. ప్రభుత్వం కాల్వల తవ్వకానికి ఏటా అరకొర నిధులే ఇస్తుండడంతో పనులు సైతం నిర్మాణ సంస్థ అరకొరగా పూర్తి చేసింది. ప్రస్తుతం ప్రాజెక్టు పర్యవేక్షణ చేస్తున్న నిర్మాణ సంస్థ ఆనకట్ట కుంగిపోవడం.. మరమ్మతు పనులు నేటికీ పూర్తికాకపోవడంతో కంపెనీ ప్రాజెక్టు నిర్వహణ చేపట్టలేమని తేల్చిచెప్పినట్లు సమాచారం. ప్రభుత్వానికి ప్రాజెక్టును సరెండర్ చేయకుండానే నిర్మాణ సంస్థ తప్పుకోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

మరమ్మతులకు నిధుల లేమి..
జిల్లాలోని కుమురంభీం ప్రాజెక్టు ప్రమాదం అంచున ఉంది. గతేడాది వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద చేరింది. వరద ఉధృతికి ప్రాజెక్టు ఆనకట్ట కుడివైపు చివరి భాగంలో 700 నుంచి 990 మీటర్ల మధ్య దెబ్బతింది. రాళ్లు, మట్టి కొట్టుకుపోయి బలహీనంగా మారింది. నీటి తాకిడికి మెల్లమెల్లగా కుంగిపోయింది. ఆనకట్టను పటిష్టం చేసేందుకు అవసరమైన నిధులు లేక అప్పట్లో ఇంజనీరింగ్ అధికారులు పాలిథిన్ కవర్లు తెప్పించారు. వరద తాకిడిని తట్టుకునేలా భారీ కవర్‌ను దెబ్బతిన్న కట్టపై కప్పేశారు. అప్పట్లో హడావుడిగా సాంకేతిక నిపుణుల బృందాన్ని రప్పించి ఆనకట్ట పటిష్టత, మట్టి నాణ్యతపై పరీక్షలు నిర్వహించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక అక్టోబర్–నవంబర్ మధ్య ఆనకట్టకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు మరమ్మతుల కోసం ఒక్కఅడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతుల కోసం పైసా నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా కొన్నాళ్లుగా ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

సర్కారు ఆదేశించగానే పనులు

ఆనకట్ట దెబ్బతిన్న ప్రాంతంలో నిపుణుల కమిటీతో జియో, సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నాం. అనంతరం సర్కారు ఆదేశాల మేరకు మరమ్మతు పనులు చేపడతాం. – గుణవంతరావ్, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆసిఫాబాద్

క్లుప్తంగా

బుగ్గగట్టు శివారులో గుప్తనిధుల తవ్వకాలు?



రక్తంతో కూడిన నవధాన్యాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుగ్గగట్టు శివారులోని కొండ పరిసర ప్రాంతాల్లో గుప్తనిధుల తవ్వకాల పుకారు కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలో పసుపు పచ్చరంగులో ఉన్న వస్త్రమూటను గమనించిన స్థానికులు అటూ ఇటూ కదిలించి చూడగా అందులో రక్తంతో తడిసిన నవధాన్యాలు ఉండడాన్ని గమనించారు. దీంతో ఇది ఖచ్చితంగా గుప్తనిధుల తవ్వలు జరిపిన వారే చేసి ఉంటారని ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని, పోలీసులు నిఘా పెట్టి ఇలాంటి చర్యలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

- విగ్రహావిష్కరణకు వెళ్తుండగా ఘటన



పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్‌రూరల్: అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. మండలంలోని బాబాపూర్ సర్పంచ్ లక్ష్మి, ఆమె భర్త రాందాస్, చెంద్రయ్య, లింగయ్య ఉదయం కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా జిన్నింగ్ మిల్లు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. లింగయ్యకు తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్‌ను అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ పరామర్శించారు.

జ్వరంతో బాలుడు మృతి



బాలుడి మృతదేహం

జన్నారం(ఖానాపూర్): మూఢ నమ్మకాలు, పేదరికం 13 నెలల బాలున్ని బలితీసుకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రాయికుంటకు చెందిన ఆత్రం లేతు, రాజుబాయి దంపతుల కుమారుడు ప్రవీణ్ (13 నెలలు) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి కాకుండా దేవుని వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. మెడికల్ షాపు నుంచి మందులు తీసుకువచ్చి వేయడంతో జ్వరం తగ్గి రెండు రోజులు బాగానే ఉన్నాడు. శుక్రవారం బాలునికి మళ్లీ తీవ్రమైన జ్వరం వచ్చింది. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్తసారసాలలో పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. పేకాట ఆడుతున్న అంగల తిరుపతి, డొబ్బల సత్తయ్య, ఉడతల పోచన్న, పుల్ల మహేశ్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సంరక్షణలో సాటి.. అభివృద్ధిలో మేటి

- ఆదర్శంగా నిలుస్తున్న జన్నారం అటవీ డివిజన్
- సందర్శిస్తున్న వివిధ రాష్ట్రాల అధికారులు



గడ్డి క్షేత్రాలను పరిశీలిస్తున్న ఫ్రెంచ్ టైగర్‌జోన్ అధికారులు (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌కు జన్నారం అటవీ డివిజన్ గుండెకాయ వంటిది. కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం అటవీ డివిజన్ 21 శాతం విస్తరించి ఉన్నా అభివృద్ధిలో మాత్రం వంద శాతం పేరు తెచ్చుకుంది. టైగర్‌జోన్ ప్రాజెక్టు అధికారి వినోద్‌కుమార్ ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎఫ్‌డీవోగా మాధవరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం అడవుల అభివృద్ధి, నూతన పద్ధతులు, వన్యప్రాణులు, అడవుల సంరక్షణ, సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఆదర్శంగా నిలుస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అటవీశాఖ అధికారులు వచ్చి జన్నారం డివిజన్‌లో పర్యటిస్తుండడంతో ప్రత్యేకత సంతరించుకుంటోంది.

ప్రత్యేకత సంతరించుకుంటున్న గడ్డి క్షేత్రాలు

జన్నారం అటవీ డివిజన్‌లో పెంచుతున్న గడ్డి క్షేత్రాలకు ప్రత్యేకత ఉంది. డివిజన్‌లో ఏటా 100 నుంచి 150 హెక్టార్లలో గడ్డి క్షేత్రాలను పెంచుతూ వస్తున్నారు. ఇప్పటి వరకు 900 హెక్టార్లకు పైగా గడ్డిక్షేత్రాలను పెంచారు. ఫలితంగా డివిజన్‌లో వన్యప్రాణుల సంఖ్య పెరుగుతోంది. గతంతో పోలిస్తే చుక్కల జింకలు, అడవి పందులు, అడవి దున్నలు, నీలుగాయి, సాంబర్ల సంఖ్య పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సమృద్ధిగా నీటి వసతి..

గడ్డి క్షేత్రాలు ఉన్నచోట కుంటలు, నీటి చెలిమెలు, ర్యాంప్‌వెల్స్ ఏర్పాటు చేసి వన్యప్రాణులకు నీటిసౌకర్యం కల్పిస్తున్నారు. ఆహారం, నీరు, ఆవాసం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్మార్ట్ అడ్మినిస్ట్రేషన్–స్మార్ట్ విజిలెన్స్

జన్నారం డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధానికి, అడవుల అభివృద్ధికి ఎఫ్‌డీవో మాధవరావు స్మార్ట్ అడ్మినిస్ట్రేషన్, స్మార్ట్ విజిలెన్స్ పద్ధతులను ఎంచుకున్నారు. డివిజన్‌లోని 40 మంది బీట్ అధికారులు, 14 మంది సెక్షన్ అధికారులు, ముగ్గురు రేంజ్ అధికారులతో కలిపి 20 వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి అందర్నీ చేర్చారు. పనుల వివరాలు, జీవోలు, కేసుల నమోదు ఇలాంటివి చేర్చారు. రేంజ్‌ల వారీగా అధికారులు, సిబ్బంది ప్రతీరోజు చేసిన పని వివరాలను అందులో పొందుపరుస్తున్నారు.

ఆనందంగా ఉంది



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ ఒక భాగం మాత్రమే. ఉన్నతాధికారుల సూచన మేరకు నాకు తోచిన టెక్నాలజీని వాడుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టా. ఎంస్ట్రైప్‌తో ఫలితాలు బాగున్నాయి. గడ్డి క్షేత్రాలు మంచి పేరు తీసుకువచ్చాయి. సిబ్బంది పనితీరుకు నిదర్శనం ఇక్కడి కుంటల్లో నేటికీ నీరు ఉండడమే. ఇక్కడ చేస్తున్న అభివృద్ధిని పరిశీలించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి అటవీశాఖ అధికారులు రావడం ఆనందంగా ఉంది.

– మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

ఇతర టైగర్‌జోన్‌ల అధికారుల పరిశీలన

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధిని వివిధ ప్రాంతాల అధికారులు తెలుసుకోవడం గమనార్హం. గత డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ నుంచి ఫ్రెంచ్ టైగర్ జోన్, ఆంధ్రప్రదేశ్‌లోని అమ్రాబాద్ టైగర్‌జోన్ అధికారులతో పాటు, కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లనుంచి అధికారులు జన్నారం డివిజన్‌లో పర్యటించారు. ఎఫ్‌డీవో మాధవరావు చేపడుతున్న అభివృద్ధి, గడ్డి క్షేత్రాలు, నీటికుంటలు, వన్యప్రాణుల సంరక్షణ, ఎంస్ట్రైప్, వాకీటాకీల వినియోగం, స్మార్ట్ విజిలెన్స్, టూరిజం అభివృద్ధి, సీసీ కెమెరాల వినియోగం గురించి అవగాహన పొందుతున్నారు. ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులపై అవగాహన పెంచుకుని తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి జన్నారం అటవీ డివిజన్‌కు వచ్చిన అధికారులను వివిధ ప్రాంతాల్లో తింపుతూ అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు.

గుడి నిర్మాణమా? గుప్త నిధుల తవ్వకమా?



నర్సింహుడి పాదాల వద్ద జరిపిన తవ్వకాలు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని రాజారాంలో కొలువైన దశావతార దైవక్షేత్రం వద్ద జేసీబీతో జరిపిన తవ్వకాలు అనుమానాలకు తావిస్తున్నాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..వారం రోజులుగా గ్రామంలోని గిరిజనులు, తవ్వకాలు చేపట్టిన వ్యక్తుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దైవక్షేత్రం వద్ద శ్రీరామ, రేణుక ఎల్లమ్మ, శ్రీమూర్తి, ఉగ్రనర్సింహ, తదితర విగ్రహాలు ఉన్నాయి. మూడు నెలల క్రితం గ్రామానికి చెందిన ఓ నాయకుడు, నెన్నెల మండలం కోణంపేటకు చెందిన ఒగ్గుకథకుడు గుడి నిర్మాణం కోసమని జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. మూడు నెలలు గడుస్తున్నా నిర్మాణాలు చేపట్టలేదు. అంతేకాకుండా అక్కడక్కడా గోతులు తవ్వి కొంత మేరకు పూడ్చివేయడం అనుమానాలకు తావిస్తోంది. నెల రోజుల్లో రేణుక ఎల్లమ్మ జాతర ఏర్పాట్లు చేయనున్నారు. లోతైన గుంతలు ఉండడంతో జాతర నిర్వహణకు కష్టంగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇటీవల గ్రామంలో మూడు సార్లు పంచాయితీ కూడా నిర్వహించారు. నెల రోజుల్లో గుడి నిర్మాణం పూర్తి చేయించనున్నట్లు సదరు వ్యక్తి ఒప్పందం చేసి రాసిచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

లంపీస్కిన్‌తో లేగదూడ మృతి

సారంగపూర్(నిర్మల్): నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో దశరథ లస్మయ్యకు చెందిన లేగదూడ లంపీస్కిన్‌తో గురువారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన దాదాపు నలుగురు రైతుల ఆవులు ఇదివరకే చనిపోయాయి. అయినా పశువైద్యాధికారుల నుంచి స్పందన లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

అంబేద్కర్ అందరివాడు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం

శ్రీరాంపూర్(మంచిర్యాల): అంబేద్కర్ అందరివాడని, అతన్ని ఏ ఒక్కవర్గానికి చెందిన వారని భావించకూడదని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం చేపట్టిన అంబేద్కర్ సేవా ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. మూగ, చెవిటి, మానసిక వికలాంగులకు సేవలందిస్తున్న ఆర్కే 6 గని జనరల్ మజ్దూర్ యోసఫ్‌ను సన్మానించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, అధికారుల సంఘం ప్రతినిధి దేవేందర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎస్సీ లైజనింగ్ అధికారి కిరణ్‌కుమార్, ఎస్టీ లైజనింగ్ అధికారి వీరన్న, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీ.ప్రవీణ్, కే.కుమార్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు డీ అన్నయ్య, నాయకులు పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి పాల్గొన్నారు.

గనులపై ..

ఆర్కే 5 గని గని మేనేజర్ అబ్దుల్‌ఖాధీర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్, ఇంజనీర్ సందీప్, పిట్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎస్సార్పీ 3 గనిపై జరిగిన కార్యక్రమంలో మేనేజర్ సంతోశ్‌కుమార్, రక్షణాధికారి మహేందర్‌రెడ్డి, పిట్ సెక్రటరీ గోపాల్, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు గోపీనాయక్ పాల్గొన్నారు. ఆర్కే 7గనిపై జరిగిన వేడుకల్లో మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, పిట్ సెక్రటరీ మెండె వెంకటి, సంక్షేమాధికారి శంతన్, నాయకులు రౌతు సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, రాజునాయక్, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం మహోన్నతమైంది

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

పాతమంచిర్యాల: రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడు అంబేద్కర్ అని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్‌నాయక్ అన్నా రు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్‌హాల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లే మనం స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్ (స్థానిక సంస్థలు)మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, అణగారిన వర్గాల కోసం అంబేద్కర్ కృషి చేశారన్నారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు వెంకటేశం, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాజేశం, నాయకులు పుట్ట మధు, చెన్నూరి సమ్మయ్య. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి, నాయకులు కాదాసి రవీందర్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘననివాళి



నివాళులర్పిస్తున్న డీఎం రవీంద్రనాథ్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. మంచిర్యాల కార్మెల్ హైస్కూల్‌లో పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద డీఈవో వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. స్థానిక ఐబీచౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కిరణ్, కైలాసం, దుర్గయ్య, వాహిద్, బారిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెరుగన్నం పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు సాధించాలి

- హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



అంబేద్కర్ జీవిత చరిత్ర తెలిపే పుస్తకాలతో రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన అంబేద్కర్ ఆశయాలను మనమంతా సాధించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నస్పూర్‌కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఈ దేశంలో పుట్టి ఉండకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇంకా అంటరానివారిగానే జీవనం సాగించేవారన్నారు. ఆయన రచించిన రాజ్యాంగ ఫలాలను మనం అనుభవిస్తున్నామన్నారు. అంబేద్కర్ జీవితచరిత్రకు సంబంధించిన పుస్తకాలను కార్యకర్తలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు అనిల్‌రెడ్డి, అశోక్, నవీన్, దుర్గం లక్ష్మణ్, ప్రదీప్‌రెడ్డి, సాయికృష్ణ, కాంత్రి, గోళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న రాంబాబు

చెన్నూర్: బీజేపీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన న్యాయవాది ఆకుదారి రాంబాబును నియమించినట్లు జిల్లా కన్వీనర్ పూదారి రమేశ్ తెలిపారు. రమేశ్ మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆదేశాల మేరకు నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాంబాబుకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై కేసు నమోదు

నెన్నెల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు ఝాన్సీరాణిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గురువారం నెన్నెల పీహెచ్‌సీలో మైలారం హెల్త్‌అసిస్టెంట్ కిరణ్‌కుమార్ టాయిలెట్ క్లినర్ లిక్విడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. డాక్టర్ వేధింపులే తన భర్త ఆత్మహత్యకు కారణమని మృతుని భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అలరించిన అష్టావధానం

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం నిర్వహించిన ముద్దు రాజయ్య అవధాని 101వ అష్టావధానం అలరించింది. ఈ సందర్భంగా రాజయ్యకు అవధాన రాజశ్రీ బిరుదు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, కవులు, రచయితలు మలయశ్రీ, నందమయ్య, శ్రీలక్ష్మి, పట్వర్ధన్, సుగుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

బేల: ఓ యువతి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన మండలంలోని దుబ్బగూడ(ఎస్)లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలం బాబ్జిపేట్‌కు చెందిన జుజ్నక్ మారుబాయి, భీంరావు దంపతుల పెద్ద కూతురు కౌశల్య(28), బేల మండలం దుబ్బగూడ(ఎస్) గ్రామానికి చెందిన మరప కౌశిక్‌రావు కుమారుడు నాగోరావు నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఈనెల 15న పెళ్లి నిర్ణయించారు. ఈ క్రమంలో దుబ్బగూడ(ఎస్)లో నివాసం ఉన్న ఆమె శుక్రవారం నిద్రలేచే సమయానికి మృతిచెంది కనిపించింది. గ్రామపటేల్ ఆత్రం లక్ష్మణ్, బాబ్జిపేట్ గ్రామపటేల్ సోయం మోతిరామ్‌కు ఫోన్‌చేసి కౌశల్య పాముకాటుతో మృతి చెందిందని తెలిపాడు. మధ్యాహ్నం ఇక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, అక్కడి వారంతా విగతజీవిగా ఆమెను చూసి, మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై బి.కృష్ణకుమార్ తెలిపారు.

రెండో విడతకు సన్నద్ధం



- గొర్రెల కొనుగోలు కోసం ప్రత్యేక కమిటీలు
- డీడీలు చెల్లించాలంటున్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: గొల్లకుర్మలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెలాఖరులోగా గొర్రెలు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించింది. ఏపీతో పాటు మహారాష్ట్రంలో గొర్రెలను కొనుగోలు చేయనున్నారు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులు డీడీలు చెల్లించాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మొదటి విడతలో 98 శాతం పంపిణీ

జిల్లాలో 183 గొల్లకుర్మ సంఘాలు, 11,619 మంది సభ్యులు ఉన్నారు. 2017లో మొదటి విడతగా 5,833 మందికి గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించగా 5,719 మందికి అందించారు.

రెండో విడత 5,786 యూనిట్లు

రెండో విడతలో భాగంగా 5,786 యూనిట్లను మంజూరు చేయాలని నిర్ణయించారు. 2018–19లో లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించి లిస్ట్ తయారు చేశారు. 2019 నుంచి 2022 ఏడాది కాలంలో డీడీలు చెల్లించిన 1,832 మంది లబ్ధిదారులకు గొర్రెలు అందజేశారు. ఎన్నికలు, కరోనా తీవ్రత, తదితర కారణాల దృష్ట్యా పంపిణీ నిలిచిపోయింది. ఇంకా 3,954 మంది లబ్ధిదారులకు యూనిట్లు అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు 1,576 మంది రూ.43,750 చొప్పున డీడీలు తీశారు. మిగిలిన 2,378 మంది డీడీలు తీయాలని అధికారులు సూచిస్తున్నారు.

పెరిగిన గొర్రెల ధర..

మొదటి విడతలో 20 గొర్రెలు, ఒక పొట్టేలతో యూనిట్ విలువ రూ.లక్షా 25 వేలుకాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.93,750 పోనూ లబ్ధిదారులు రూ.31.250 చెల్లించారు. ఈ ఐదేళ్లలో గొర్రెల ధరలు అధికంగా పెరిగాయి. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రెండో విడత యూనిట్ ధర రూ.లక్షా 75వేలు కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.1,26,250 పోనూ లబ్ధిదారులు రూ.43,750 చెల్లించాల్సి ఉంటుంది.

లబ్ధిదారులు డీడీ చెల్లించాలి



మొదటి విడతలో 98 శాతం గొర్రెల యూనిట్లు అందజేశాం. రెండో విడతలో 5,786 మందిని ఎంపిక చేయగా 1,832 యూనిట్లు అందించాం. మిగిలిన 3,954 యూనిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు 1,576 మంది డీడీ చెల్లించారు. మిగతా 2,378 మంది పది రోజుల్లోగా చెల్లించాలి. నిధులు విడుదల కాగానే నిర్ణయించిన జిల్లాల నుంచి గొర్రెల యూనిట్లను తీసుకువచ్చి లబ్ధిదారులకు అందజేస్తాం.– వై.రమేశ్‌కుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

వేగవంతమైన ప్రక్రియ..

ప్రస్తుతం బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ప్రభుత్వం ఈ నెలలో లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. టెక్నికల్ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల ఆధ్వర్యంలో గొర్రెల యూనిట్లు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఏపీలోని అనంతపూర్, కర్నూల్, గుంటూర్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుంచి కొనుగోలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 6న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులు పదిరోజుల్లోగా డీడీలు చెల్లించే విధంగా అధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలతో పశువైద్యులు గ్రామాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గొర్రెల పంపిణీ, యూనిట్ ధర, గొర్రెల ఎంపిక, రవాణా ప్రక్రియ, ఇన్సూరెన్స్, ట్యాగ్‌లు, ఇంటివద్ద గొర్రెల పెంపకం, తదితర అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు.